క్లుప్తంగా

చురుగ్గా ఇంటింటి కుళాయి పనులు



గంగాదేవిపేటలో సాగుతున్న ఇంటింటికీ కుళాయి ఏర్పాటు పనులు

మునగపాక: గంగాదేవిపేటలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో ప్రస్తుతం పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం 20 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆదివారం సంబంధిత పనులను ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, వార్డు సభ్యురాలు వాకపల్లి నూకాలమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ



క్రీడాకారులతో గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు విజయ్, తదితరులు

మునగపాక: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెరుగుతుందని గ్రామీణ యువజన మందిరం క్రీడా విభాగం అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. మునగపాకలో సాధన చేస్తున్న వాలీబాల్ క్రీడాకారులకు ఆదివారం టీ షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులున్నారన్నారు. వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కర్రి సాయి కృష్ణ, గ్రామీణ యువజన మందిరం కార్యదర్శి ఆడారి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌కు సన్మానం



బి.జె.వి.ప్రసాద్‌ను సన్మానిస్తున్న పట్టణ వాసులు

పాయకరావుపేట: గొలుగొండ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బి.జె.వి.ప్రసాద్‌ను పట్టణంలో ఆదివారం స్థానికులు ఘనంగా సన్మానించారు. ప్రసాద్ జిల్లాలో ఉత్తమ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా ఈ నెల 15న ఎంపీ సి.ఎం.రమేష్, హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయి రమేష్, డి.సామ్‌సన్, బి.రమణ, ఎ.జోషీపాల్, దడాల నెహూ, గొల్లాబత్తుల ఆనంద్ పాల్గొన్నారు.

'బల్లా'కు విశిష్ట సేవా పురస్కారం



బల్లా నాగభూషణం

అనకాపల్లి : తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఈనెల 29న జరగనున్న సందర్భంగా విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'జాతీయ స్థాయి కళా, సామాజిక సేవా రంగం విశిష్ట అవార్డు (గిడుగు రామమూర్తి) స్థానిక చిన్నరాజుపేటకు చెందిన సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, విశ్రాంత జైల్ వార్డర్ బల్లా నాగభూషణంకు వచ్చింది. ఈ మేరకు ఆదివారం నాగభూషణం ఒక ప్రకటనలో ఈ విషయం పేర్కొన్నారు. 20 సంవత్సరాల క్రితం అసోసియేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు చేయడం వల్ల ఈ అవార్డు దక్కడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. నేటి యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సాధించాలని ఆయన కోరారు.

ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన కుసుమకు అభినందనలు

కశింకోట : కశింకోటలోని బాలికల హైస్కూల్లో ఈ ఏడాది టెన్త్ చదివిన కళింగ కుసుమకు ట్రిపుల్ ఐటీ సీటు లభించింది. 567 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఆమెకు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో తాజాగా సీటు వచ్చినట్లు హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణ కుమారి తెలిపారు. ఆమెతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది కుసుమను అభినందించారు.

ప్రత్యేక చట్టాలు చేయాలి



ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. ఈ ఘటనతో సంబంధమున్న అందర్నీ గుర్తించి కఠినంగా శిక్షించాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలి. మహిళా డాక్టర్లు, సిబ్బంది రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించేటప్పుడు పోలీసు నిఘా ఉంచాలి. వీలైతే బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ బినయ్ కుమార్, ఆయుర్వేద వైద్యుడు, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, యలమంచిలి

ఆందోళనతో విధుల నిర్వహణ



గ్రామాల్లో పర్యటిస్తూ వైద్య సేవలు అందించేటప్పుడు కనీస రక్షణ ఉండడం లేదు. ఆస్పత్రిలో విధులు నిర్వహించేటప్పుడు కొందరు మద్యం సేవించి వైద్యం కోసం వస్తున్నారు. అటువంటి వారితో చాలా ఇబ్బంది పడుతున్నాం. గట్టిగా మాట్లాడితే తమకు సహాయంగా నిలిచే వారు కూడా ఉండడం లేదు. ఎప్పుడు ఏ సమస్య వస్తుందోనన్న ఆందోళనలో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి నెలకొంది.

– ఎస్.వాసంతి, వైద్యాధికారి, సర్వసిద్ధి పీహెచ్‌సీ, ఎస్.రాయవరం మండలం

యలమంచిలి రూరల్/ఎస్.రాయవరం

చేనేతకు దన్నేది?

- నిరుపయోగంగా ఫ్యాషన్ టెక్నాలజీ భవనం
- వైఎస్సార్ హయాంలో శిక్షణ కేంద్రం ప్రారంభం
- ఉపాధి లేక నేత కార్మికుల ఆర్థిక కష్టాలు



దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రం



మూతపడి ఉన్న భవనం మొదటి అంతస్తు



నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనం

పాయకరావుపేట: చేనేత కార్మికులకు భరోసా కరువైంది. పట్టణంలో నాణ్యమైన వస్త్రాలు (చీరలు) తయారు చేయడం కోసం 2003లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రం మూలకు చేరింది. చేనేత కార్మిక సంఘం(ఫ్యాషన్ టెక్నాలజీ భవనం) భవనం నిరుపయోగంగా పడి ఉంది. చేనేత సహకార సంఘానికి సంబంధించిన స్థలంలో కార్మికుల కోసం 2003లో భవనం నిర్మాణం చేపట్టారు. రూ.3 లక్షలు చేనేత కార్మికులు అందరూ చందాలు వేసుకున్నారు. మరో రూ.3 లక్షలు విశాఖపట్నం డీఆర్‌డీఏ ఆర్థిక సాయంతో భవనం నిర్మాణం పూర్తి చేశారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ పల్లె బాట కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట వచ్చి ఈ భవనంలో ఫ్యాషన్ టెక్నాలజీని ప్రారంభించారు. ఐదేళ్ల పాటు ఇక్కడ మహిళలు కుట్టు మిషన్ శిక్షణ ద్వారా ఉపాధి పొందారు. అనంతరం మిషన్ టెక్నాలజీ నిర్వహణ భారం కావడంతో మూత పడింది. తర్వాత డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అదే మిషనరీ సామగ్రితో ప్రైవేట్ వ్యక్తులకు నెలకు రూ.12 వేలు చొప్పున అద్దెకు ఇచ్చారు. పదేళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఫ్యాషన్ టెక్నాలజీ నిర్వహించారు. అనంతరం ప్రైవేట్ వ్యక్తులు కూడా నిర్వహణ భారంతో చేతులెత్తేశారు. అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా పడి ఉంది. ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణ సమయంలో మరో రూ.15 లక్షల డీఆర్‌డీఏ నిధులతో మొదటి అంతస్తు నిర్మించారు. ప్రస్తుతం భవనం అంతా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. తమకు స్థలం, భవనం స్వాధీనం చేస్తే అందులో మగ్గాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తామని పదేళ్లుగా జిల్లా అధికారులకు, సంబంధిత నాయకులకు చేనేత కార్మికులు మొరపెట్టుకుంటున్నా ఫలితం ఉండడం లేదు. పట్టణంలో సుమారు 500 కుటుంబాలు చేనేత వృత్తి పైనే జీవిస్తున్నాయి. వీరికి చీరలు తయారీకి మగ్గాలు ఏర్పాటు చేసుకోవడానికి గృహాలు లేవు. అద్దెకు ఇళ్లు కూడా ఇవ్వడం లేదు. దీంతో చేనేత సహకార సంఘానికి చెందిన స్థలం తప్పకు అప్పగించితే చీరలు తయారీకి మగ్గాలు ఏర్పాటు చేసుకుంటామని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

తక్షణం భవనాన్ని అప్పగించాలి



చేనేత కార్మికుల స్థలంలో డీఆర్‌డీఏ భాగస్వామ్యంతో భవనం నిర్మించారు. కానీ ఫ్యాషన్ టెక్నాలజీ కుంటు పడింది. చేనేత కార్మికులకు మగ్గాలు పెట్టుకోవడానికి వసతి లేదు. కార్మికులకు మగ్గాలు ఏర్పాటుకు ఇళ్లు కూడా అద్దెకు ఇవ్వడం లేదు. మా సంఘానికి చెందిన భవనాన్ని ప్రభుత్వం మాకు అప్పగించాలి.

– గోరు నాగేశ్వరరావు, మేనేజర్, చేనేత సహకార సంఘం

చేనేత పనే దిక్కు..



చేనేత పని మీద జీవనం సాగిస్తున్నాం. మగ్గాలు ఏర్పాటుకు అవసరమైన వసతి లేదు. సంఘానికి చెందిన భవనాన్ని అప్పగిస్తే తామందరం భవనంలో మగ్గాలు పెట్టుకుని ఉపాధి పొందుతాం. దీనిపై ఎన్నో సార్లు అధికారులకు విన్నవించుకున్నాం. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

– దొంతంశెట్టి మహేశ్వరి, చేనేత కార్మికురాలు, పాయకరావుపేట

హిందువులపై దాడులను అరికట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవాగ్ శోభారాణి

కోటవురట్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలను నిరోధించాలని, హిందూ దేవాలయాల కూల్చివేతలను నిరసిస్తూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిని రాష్ట్ర కార్యవాగ్ శోభారాణి మాట్లాడారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన చర్చిలో ముగ్గురు పిల్లల మృతి కారణమైన పాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ జె.అనంతలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పోతురాజు పండగ రేపు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం పోతురాజు పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పాటిమీద సమీపంలో ఉన్న ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలోని పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, సత్తిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతమ్మకు మంగళ సూత్రాల బహూకరణ



బంగారు మంగళ సూత్రాలు ఆలయ అర్చకులకు అందజేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం సీతారామస్వామి ఆలయంలో సీతమ్మతల్లికి బంగారు మంగళ సూత్రాలను ఆదివారం బహూకరించారు. గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకట రమణ, బేబీ కుమారుడు అయిన మోహన్‌రావు ఆర్థిక సహకారంతో ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం బంగారు మంగళ సూత్రాలను ఆలయ ప్రధాన అర్చకులు వెంకట రమణకు ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు పాల్గొన్నారు.

తక్షణమే శానిటేషన్ కార్మికుల జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ మహిళా విభాగం కార్యదర్శి జానకి

అనకాపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ కార్మికుల సమస్యలపై సర్కారు తక్షణమే స్పందించాలని, ఈ ఏడాది మార్చి నుంచి బకాయి పడిన జీతాలు చెల్లించాలని స్కూల్ శానిటేషన్ జిల్లా (సీఐటీయూ) మహిళా విభాగం కార్యదర్శి జానకి అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి మానసిక ఆవేదనకు గురి చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాలకు చెందిన తమను రాజకీయంగా తొలగించేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూళ్లలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురి అవుతున్నారని, వెయ్యి మంది వరకు ఉన్న పాఠశాలలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి స్కూళ్లలో ఇద్దరు లేక ముగ్గురు పని వారిని నియమించి పని మొత్తం చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు కనీసం సెలవు కూడా ఇవ్వటం లేదని, పేద మహిళలు, ఒంటరి మహిళలు ఈ పథకంలో పని చేస్తున్నారని తెలిపారు. అలాంటిది నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఏం తిని బ్రతకాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మణి, జానకి, నీలవేణి, వరలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి 'ఆత్మీయ విద్యార్థిసేన' సాయం



స్నేహితుడు వేంకటేశ్వరరావుకి ఆర్థిక సాయం అందిస్తున్న ఆత్మీయ విద్యార్థిసేన ప్రతినిధులు

చోడవరం : ఒకే స్కూల్లో చదువుకున్న సహచర స్నేహితుడికి పూర్వపు విద్యార్థులంతా చేయూతనందించారు. మామిడిపాలెం హైస్కూల్లో చదువుకున్న విద్యార్థులంతా ఆత్మీయ విద్యార్థి సేన ఏర్పాటు చేసుకొని ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ ఈ ఆత్మీయ విద్యార్థి సేన తరపున సహాయం అందిన్నారు.

దీనిలో భాగంగా చోడవరం మండలం గంధవరం గ్రామానికి చెందిన ఇదే స్కూల్‌లో చదువుకున్న పల్లా వెంకటేశ్వరరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్దే ఉన్నారు. తమ స్కూల్లో చదువుకొని రోడ్డు ప్రమాదానికి గురై ఇబ్బందిలో ఉన్న తమ స్నేహితుడికి సహాయం అందించేందుకు ఆత్మీయ విద్యార్థిసేన ముందుకు వచ్చింది. రూ. 40వేలు నగదును విద్యార్థి సేన తరపున తమ స్నేహితుడికి సాయంగా అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వారికి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిసేన అధ్యక్షుడు పల్లా రాజు, ఉపాధ్యక్షుడు తోటాడ సింహాచలం, కార్యదర్శి గొల్లవిల్లి శ్రీనువాస్, కోశాధికారి వునుకూరి కృష్ణ, సభ్యులు ముత్తురెడ్డి రమేష్, ఒ.వి.ఎస్ కుమార్, కాకర అప్పలరాజు, తోసంగి రవి పాల్గొన్నారు.

చిన్ని కృష్ణుని రాక కోసం...

- నేడు జన్మాష్టమి
- ముస్తాబైన ఆలయాలు



దేవవరంలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ

నక్కపల్లి: శ్రీకృష్ణాష్టమికి మండలంలోని కృష్ణ మందిరాలు సిద్ధమవుతున్నాయి. దేవవరం, గొడిచర్ల, డీఎల్‌పురం, వేంపాడు, ఉద్దండపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కృష్ణుని విగ్రహాలను ముస్తాబు చేశారు. వేకువజామున ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించనున్నారు. దేవవరంలో కృష్ణాష్టమి పండగను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు శ్రీకృష్ణ యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు. రామాలయం వద్ద విద్యుద్దీపాలంకరణ చేశారు. సోమవారం కృష్ణునికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కోలాటం, తోడపెద్దు సంబరాలు, హరిభజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మునగపాక సంతబయలులో కొత్తగా నిర్మించిన ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేసి, గ్రామంలో ఊరేగించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

మునగపాక(అచ్యుతాపురం): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు పూర్తి చేశారు. అచ్యుతాపురంలోని ఆలయాన్ని ముస్తాబు చేశారు. పలు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. శ్రీకృష్ణుని విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించేలా ఏర్పాట్లు చేశారు.



పోటీల్లో భాగంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



మునగపాకలోని శ్రీకృష్ణుని ఆలయం

ఎస్.రాయవరం: మండలంలోనికోనవానిపాలెం, పెట్టుగోళ్లపల్లి, కె.పోలవరం, పెనుగొల్లు, రామయ్యపట్నం, గుర్రాజుపేట, సర్వసిద్ధి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కోనవానిపాలెంలో ఐదు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఉట్టి సంబరం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కొత్త ఓటర్లు నమోదు చేసుకోండి

మాడుగుల రూరల్ : ఎన్నికల సంఘం ఆదేశాలతో కొత్త ఓటర్లు నమోదు చేసుకోవాలని స్థానిక తహసీల్దారు పి.వి.రత్నం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన వారు అంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. గ్రామాల్లో బీయల్‌వోలు ఇంటింటికి తిరిగి నూతన ఓటర్లను నమోదు చేసుకుంటారని, అలాగే ఓటర్ల చేర్పులు, మార్పులు, సవరణలు, చేసుకోవచ్చునని ఎన్నికలు సంఘం ఆదేశాలు మేరకు వచ్చే నెల 21 వ తేదీ వరకు ఈ ప్రక్రియ జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

అనకాపల్లి : కొత్త ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనీఫిల్స్ పెన్షన్ స్కీమ్ ప్రవేశానికి ప్రకటన జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ తో పాటు గ్రాట్యుటీ, డీఆర్ కూడా ఇస్తామని ప్రకటించారన్నారు. ఉద్యోగులు మాత్రం పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)లో ఉన్న ప్రయోజనాలను మాత్రమే కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి నూతన ప్రభుత్వం ఉద్యోగుల చందాతో పనిలేని పాత పెన్షన్ పథకం కోసం ఆలోచన చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

రోలుగుంట: తమ న్యాయ సమ్మతమైన సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వీరి సమస్యలపై సీఐటీయూ మండలశాఖ అధ్యక్షుడు ఈరెల్లి చిరంజీవి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రం చేస్తూ తద్వారా ఆరోగ్య గ్రామాలుగా తయారు చేయడానికి పారిశుధ్య కార్మికుల సేవలే కీలకం అన్నారు. వీరి సేవలను గమనంలోకి తీసుకొని కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. అలాగే వారికి గ్లౌజులు, నూనె, సబ్బులు, యూనిఫాం, ఐడీ కార్డులివ్వాలన్నారు. బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని, జీతాలు పెండింగ్ లేకుండా ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. వీటిని పరిష్కరించకుంటే వీరి ఆందోళన ఉధృతం చేయాల్సి ఉంటుందన్నారు.

క్యాన్సర్ రోగికి 'స్నేహాంజలి' బాసట



అచ్చియ్యమ్మకు నగదు అందిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యురాలు సంతోషి నళిని

దేవరాపల్లి : క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యం, ఆర్థికపరమైన ఇబ్బందులతో సతమతమవుతున్న వృద్ధురాలికి స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ బాసటగా నిలిచింది. చీడికాడ మండలం అర్జునగిరి చెందిన నిరుపేద వృద్ధురాలైన సాలాపు అచ్చియ్యమ్మ క్యాన్సర్ బారిన పడి వైద్య ఖర్చులకు సైతం ఇబ్బందులు పడుతోంది. దేవరాపల్లిలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్న నిరుపేద వృద్ధురాలికి రూ.12వేలు నగదును ఆదివారం స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ నగదును అందించిన వారిలో స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యురాలు, స్థానిక ఇంచార్జ్ ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఆర్గనైజేషన్ వలంటీర్లు సన్యాసినాయుడు, వాసు ఉన్నారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా ఇప్పటి వరకు 202 సేవా సహాయ కార్యక్రమాలు చేపట్టినట్టు సభ్యురాలు సంతోషి నళిని తెలిపారు.

ఆస్పత్రిలో కింగ్‌కోబ్రా కలకలం



మోతుగూడెం జెన్‌కో ఆస్పత్రిలో ప్రవేశించిన కింగ్‌కోబ్రా

మోతుగూడెం: మోతుగూడెం ఏపీ జెన్‌కో ఆస్పత్రి ఓపీ రూమ్‌లోకి సుమారు 12 అడుగుల కింగ్‌కోబ్రా ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది భయాందోళనకు గురైయ్యారు. ఆస్పత్రి సిబ్బంది వెంటనే పాము దూరిన గదికి తాళం వేశారు. అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సిబ్బంది వచ్చి కింగ్‌కోబ్రాను పట్టుకొని సమీప అడవిలో వదిలేశారు.

ప్రభుత్వ విధానాలు, డిజైన్ లోపం వల్లే ఎసైన్షియా ప్రమాదం

సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం విమర్శ

అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వ విధానాలే కారణమని తేటతెల్లమయ్యిందని, ఫార్మాలో రియాక్టర్ పైపులైన్, డిజైన్‌లోని లోపాలే ప్రధాన లోపమని రాష్ట్ర విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ ప్రకటించారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్ని బట్టి ప్రభుత్వాలు కంపెనీల యాజమాన్యాల పట్ల ఎంత ఉదాసీనంగా ఉంటున్నాయో అర్థమవుతుందన్నారు. కంపెనీల వారీగా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఆ నివేదికలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. యాజమాన్యాలు లోపాలను సరి చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని పేర్కొన్నారు.